క్లుప్తంగా

డంపర్ బాక్స్‌లు ఉపయోగించండి

నగర మేయర్‌కు వినతి

లక్ష్మీపురం: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అలాగే నగరంలోని డంపర్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలని యూనియన్ అధ్యక్షులు చినబోతుల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకత్వం కలిసి మున్సిపల్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కోటి వీరాంజనేయులు, సహాయ కార్యదర్శి బొట్టు సద్గుణ రావు, ఉపాధ్యక్షులు మిరియాల కోటేశ్వరరావు, సాంసన్, మహేశ్వరరావు, అంతరాజు శివశంకర్ పాల్గొన్నారు.

ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్



లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి డీలర్లు వారి రేషన్ దుకాణాల వద్దనే రేషన్ పంపిణీ చేయాలని గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం గుంటూరు వెస్ట్ మండల పరిధిలోని రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు క్రమం తప్పకుండా కార్డుదారులకు ప్రభుత్వం అందజేసే నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. 65 సంవత్సరాల వయస్సు పై బడిన వారికి అంగవైకల్యం కల్గిన కార్డుదారులకు ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలని, రేషన్ షాపుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్డుదారులతో గౌరవంగా మాట్లాడాలని, నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు.

బదిలీలకు ఆన్‌లైన్ సేవలు

గుంటూరు ఎడ్యుకేషన్ : జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన ఆన్‌లైన్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు శనివారం తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయ బృంద ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపుతున్నామని, సంబంధిత ఉపాధ్యాయులు 96186 21764, 96662 28198, 89192 50950 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలియపరిస్తే, ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసి, తిరిగి ఉపాధ్యాయుల వాట్సాప్‌కు పంపుతామని తెలిపారు.

వాసవి క్లబ్ సాయం



నగరంపాలెం: వాసవి క్లబ్ గుంటూరు సభ్యులు ఉదారతను చాటుకున్నారు. నల్లచెరువుకి చెందిన బి.పుల్లమ్మ(85) ఆర్‌అగ్రహారం గీతా మందిరం వద్ద ఒంటరిగా ఉండేది. ఈ క్రమంలో ఆమెను ఈనెల 17న నగరంలోని ఓ ఆశ్రమంలో చేర్పించారు. ఆశ్రమంలో ఉంటున్న పుల్లమ్మ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచింది. దీంతో ఆమె అంత్యక్రియలు, ఇతరత్రా కార్యక్రమాల దృష్ట్యా పుల్లమ్మ కుటుంబ సభ్యులకు శనివారం ఆర్ అగ్రహారం గీతా మందిరం వద్ద రూ.27 వేలు అందజేశారు. వాసవిక్లబ్ గుంటూరు సభ్యుల సహకారంతో నగదు సహాయం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు జుజ్జూరు శ్రీనివాసరావు, నేరేళ్ల హరి, మొగలి సతీష్, నూనె కిషోర్, దివ్వెల కోటేశ్వరరావు, గుండా మణిశేఖర్ పాల్గొన్నారు.

జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్ షూటింగ్‌లో ముఖేష్‌కు కాంస్య పతకం



గుంటూరు వెస్ట్: ఈనెల 19 నుంచి జర్మనీలోని సొహల్‌లో ప్రారంభమైన ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ కప్ రైఫిల్ షూటింగ్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ కాంస్యం గెలుపొందాడు. ఇంకా ఈ పోటీలు ఈనెల 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

తుక్కు...తుక్కు...

- మట్టిలో కలిసిపోతున్న విలువైన వాహనాలు
- పోలీసుస్టేషన్‌లు, ఆర్టీఓ కార్యాలయాల్లో మగ్గిపోతున్న వాహనాలు
- గుట్టలు... స్టేషన్‌లలో ఉండిపోతున్న పరిస్థితి
- నగరంలోని స్టేషన్ పరిధిలోని సుమారు 1000పైగా వాహనాలు
- ప్రజలపై అదనపు భారం



ఆర్టీఓ కార్యాలయంలో మగ్గిపోతున్న వాహనాలు

పట్నంబజారు: కేసు ఏదైనా కావచ్చు.. వాహనం ఎన్ని లక్షలైనా అవ్వచ్చు.. పోలీసుల నిర్లక్ష్యమో.. లేక వాహనదారులు పట్టించుకోని తనమో.. విలువైన వాహనాలు పోలీసుస్టేషన్‌లు, ఆర్టీఓ, ఎక్సైజ్ కార్యాలయాల్లో మగ్గిపోతున్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. అయినా పట్టించుకుని.. వేలం పాట తరలించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనితో ప్రజాధనం మట్టిపాలైపోతోంది.

నగరంలో పరిస్థితి ఇలా..

గుంటూరు నగరంలోని ఈస్ట్, వెస్ట్ సబ్‌డివిజన్‌ల పరిధిలో మొత్తం ఆరు లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌లు, రెండు ట్రాఫిక్ స్టేషన్‌లు, ఎక్సైజ్ స్టేషన్‌లు రెండు, జిల్లా ఆర్టీఓ కార్యాలయం ఉన్నాయి. అయితే వీటి పరిధిలో అనేక వాహనాలు ఏళ్లకు తరబడి ఆయా కార్యాలయాల పరిధిలో ఉండిపోయి.. తుక్కుతుక్కుగా మారిపోతున్నాయి. ఆయా స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు తరలించిన వాహనాలు, కరోనా సమయంలో నిబంధనలు పట్టించుకోకుండా పట్టుకున్న వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వెహికల్స్, అక్రమ మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన వాహనాలతో పాటు అనేక ప్రమాదాల్లో కూడా సీజ్ చేసిన వాహనాలు స్టేషన్‌ల్లోనే సమాధి అవుతున్నాయి.

వాహనాలపై ఆసక్తి చూపని వైనం..

కేసులు పరిష్కారం కాకనో లేక కేసులో పట్టుబడిన వాహనాలపై యజమాని ఆసక్తి చూపకపోవడమో... వంటి కారణాలతో సంవత్సరాల తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. ఎంతో విలువైన ఈ వాహనాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. అందులోనూ కొన్ని పోలీస్ స్టేషన్లలో వీటిని ఉంచేందుకు స్థలం లేక ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే అక్కడ పెట్టేస్తున్నారు. ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో, వెస్ట్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో, అరండల్‌పేట పీఎస్ పరిధిలో వెనుక ఉన్న తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో, నల్లపాడు పీఎస్‌లో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో, కొత్తపేట పీఎస్ పరిధిలో మరీ నడిరోడ్డులో వాహనాలను పెట్టి వదిలేస్తున్నారు. ఆ తరువాత వాటి గురించి పట్టించుకోని పరిస్థితులు ఉండటంతో వాహనాలు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. సుమారు 1000పైగానే వాహనాలు నగర పరిధిలోని స్టేషన్‌ల పరిధిలో మగ్గిపోతున్నాయంటే అధికారులు నిర్లక్ష్యం కళ్ళకు కట్టినట్లు కనపడుతోంది. పలు వాహనాలకు సంబంధించి పార్ట్‌లు కూడా చోరీకి గురవుతున్న పరిస్థితులు. బ్యాటరీలు, ఇంజన్‌లు కూడా పలు వాహనాలకు లేకుండా కనపడుతున్నాయి.

గతంలో వేలం పాటతో ప్రభుత్వానికి రాబడి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పట్టుబడిన వాహనాల కేసులను త్వరితగతిన పరిష్కరించి యజమానులు తీసుకుపోకుంటే వెంటనే వేలం వేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి మూడు నెలలకు పోలీసు, సెబ్ స్టేషన్లలో వేలం నిర్వహించేవారు. ఈ విధంగా చేయడం వలన విలువైన వాహనాలు మట్టిలో కలిసిపోకుండా ప్రభుత్వానికి రాబడి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. పట్టుబడిన వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీనివలన ప్రజాధనం వృథా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు.

సీజ్ చేసిన వాహనాలు..



లాలాపేట పీఎస్‌లో వాహనాల ప్రదేశంలో ఉన్న కేసుల్లోని వాహనాలు

ప్రమాదాలు, కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించాలి. పంచనామా నిర్వహించిన వాహనాలను ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం ద్వారా విక్రయించాలి. పోలీసులు ఆర్టీఓ అధికారులు సంప్రదించి వేలం నిర్వహించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవల కాలంలో రెండు సార్లు వేలం నిర్వహిస్తున్నామని ప్రకటించిన ఆర్టీఓ అధికారులు పలు కారణాల రీత్యా వాయిదా వేసిన పరిస్థితులు. అధికారులు దృష్టి సారించి వాహనాలు మట్టిపాలు కాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



గుంటూరు మెడికల్: వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడి ప్రాణం పోయిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా ఆరోపించారు. జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిన యువకుడి కుటుంబ సభ్యులను షేక్ నూరిఫాతిమా పరామర్శించారు. యువకుడి భౌతికాయాన్ని సందర్శించి మృతికి గల కారణాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జనరల్ వార్డుకు తరలించిన నాలుగు గంటల వ్యవధిలోనే సైదా చనిపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. యువకుడి మృతిపై ఆసుపత్రి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. యువకుడి మృతిపై తక్షణమే విచారణ జరిపించి న్యాయం చేయాలన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి కేరాఫ్‌గా ఆసుపత్రిని తీర్చిదిద్దారన్నారు. నేటి ప్రభుత్వం జీజీహెచ్‌ను పట్టించుకోవడం లేదని, అందువల్లే నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు జీజీహెచ్ రూపు రేఖలు మార్చామంటూ చెబుతున్నప్పటికీ నిర్లక్ష్యం ఏమాత్రం మారలేదన్నారు. యువకుడి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కడుపు నొప్పితో బాధపడుతూ మూడు రోజుల క్రితం క్యాజువాలిటీకి చికిత్స కోసం వెళ్లిన షేక్ సైదాను క్యాజువాల్టీలో పరీక్షించిన వైద్యులు ఐసీయూకు తరలించారు. ఐసీయూలో పూర్తి చికిత్స అందించకుండానే వైద్యులు పట్టించుకోకుండా 104 వార్డుకు తరలించారని, అందువల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ సైదా కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు.

టెండర్ పొందిన వారే చెత్త తరలించాలి

మేయర్ రవీంద్ర



మార్కెట్‌లో పర్యటిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలో హోల్‌సేల్ మార్కెట్లలలో ఆశీలు వసూలుకు టెండర్ పొందిన వారే నిర్దేశిత ప్రాంతంలోనే ఆశీలు వసూలు చేయడంతో పాటు ఆయా ప్రాంతాలలో వ్యర్థాలను కూడా వారే తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి బండ్ల బజార్(హోల్ సేల్ ఫ్రూట్ మార్కెట్), లాలాపేట, పట్నంబజార్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లీన్ - గ్రీన్ గుంటూరు కోసం నగర పాలక సంస్థ అన్ని విభాగాలు ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నామని, ఇందుకు నగర ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు. నగర నడిబొడ్డులోని పట్నంబజారులో ప్రతి రోజు క్వింటాళ్ల కొద్దీ వ్యర్థాలు వస్తున్నాయని, వాటిని సరైన పద్ధతిలో తొలగించకపోవడం వలన స్థానికంగా తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు గత కొంతకాలంగా అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. అదనపు కార్మికులు, వాహనాలు, పుష్ కార్ట్స్, సామగ్రిని అందించామని చెప్పారు. శానిటరీ వార్డుల వారీగా ఉదయం సాయంత్రం పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. లాలాపేట, పట్నం బజారు, బండ్ల బజారు ప్రాంతాలలో హోల్ సేల్ వ్యాపారస్తుల నుంచి ఆశీలు వసూలు చేసే టెండర్ దారు ఆయా ప్రాంతాల పరిశుభ్రత బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆదర్శ నగర్‌లో తాగునీటి సరఫరాపై అందిన ఫిర్యాదు ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు మహమ్మద్ చిష్టి, ఈరంటి వరప్రసాద్, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నజీర్

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో రూ.3.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 54, 56 డివిజన్లలో రూ.2.43 కోట్లతో, పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్లో రూ.72.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటుకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ మహ్మద్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవిలతో కలిసి శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్ల పై వర్షపు నీరు నిలిచి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గుంటూరు నగరంతోపాటు నగరంలో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, అయిశెట్టి కనకదుర్గ, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్, ఈఈ సుందర్రామిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్రహ్లాద భక్తి విజయం యక్షగానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శనివారం సద్గురు త్యాగరాజ విరచిత ప్రహ్లాద భక్తి విజయం యక్షగాన ప్రదర్శన నిర్వహించారు. ఈశ్వర వరప్రసాద పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించగా పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సూత్రధారుడు త్యాగయ్య పాత్రను డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం విష్ణుమూర్తిగా కొల్లి అక్షయ, లక్ష్మీదేవిగా దేవేంద్ర గాయత్రి, ప్రహ్లాదునిగా బిక్కి తోషిత, నారదునిగా కొర్లకుంట వైష్ణవి, సముద్రుడుగా నాట్యాచార్య బాలసుబ్రమణ్యాచారి, గరుత్మంతుడుగా దొంతిరెడ్డి లక్ష్మీగోపిక తదితర పాత్రలలో ప్రదర్శించిన యక్షగానం అలరించింది. నిర్వాహకులు డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, మోదుగుల రవికృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో కాజా నాగలక్ష్మి, చంద్రమోహన్, పి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నవ్వుతూ నవ్విస్తూ సానుకూల దృక్పథాన్ని పెంపొందిద్దాం

లక్ష్మీపురం: జీవితాన్ని వృథా చేయవద్దని, నవ్వుతూ నవ్విస్తూ మన చుట్టూ ఉన్న వారిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందిద్దామని తద్వారా మనతో పాటు వారి ఆరోగ్యాన్ని పెంచుదామని ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, హాస్య వల్లరి బృంద సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నవ్వండి, నవ్వించండి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాస్యం ఒక ఆప్త మిత్రుని వంటిదని, అది మనల్ని నవ్విస్తుంది, కవ్విస్తుంది, ఆనంద పరవశుల్ని చేస్తుందన్నారు. హాస్యం ఒక గొప్ప ఔషధంలా కూడా పని చేస్తుందన్నారు. ప్రముఖ మెజీషియన్ ఆర్.పి.ఎల్.నరసింహారావు మాట్లాడారు. అనంతరం హాస్య వల్లరి బృందం జోక్స్, హాస్య, వ్యంగ్య సంభాషణలతో, కామెడీ స్కిట్స్‌తో హాస్య ప్రియులు ప్రసాద్, గుప్త, పింగళి భాగ్యలక్ష్మి, జమదగ్ని, వివి రావ్, అప్పారావులు అందరినీ కడుపుబ్బ నవ్వించారు.

సిరివెన్నెల సీతారామశాస్త్రికి నివాళి

లక్ష్మీపురం: తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి అని సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం సిరివెన్నెల సీతారామ శాస్త్రి జయంతి నిర్వహించారు. తొలుత చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రాజశేఖర్, సాయిబాబు, జమదగ్ని తదితరులు నివాళులర్పించారు.

ప్రజా శాస్త్రవేత్త జయంత్ నర్లీకర్ స్ఫూర్తిదాయకుడు



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక దృక్పథాన్ని, శాస్త్రీయతను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు జయంత్ నర్లీకర్ విశేష కృషి చేశారని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ జయంత్ నర్లీకర్ సంస్మరణ సభ నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిశోధనశాలల్లో ఉన్న సైన్స్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించిన మహోన్నతుడు జయంత్ నార్లేకర్ అని కొనియాడారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవడంలో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. డాక్టర్ ఏ.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ నర్లీకర్ జాతీయ ఖగోళ శాస్త్ర సంస్థను ప్రపంచస్థాయి సంస్థగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారని తెలిపారు. టీఆర్ రమేష్ మాట్లాడుతూ నర్లీకర్ రాసిన సైన్స్ పుస్తకాలు ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతోపాటు పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలు, డాక్టర్ నాయుడమ్మ స్మారక పురస్కారం, ఫ్రెంచ్ ఖగోళ శాస్త్ర సంస్థ అవార్డు సహా అనేక అవార్డులు అందుకున్నారని వివరించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, టీఆర్ చాందిని, బి.ఉదయ్‌భాస్కర్, జి.వెంకటరావు, సదాశివరావు, ఎం.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.6.40 లక్షల మోసం

లక్ష్మీపురం: అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఇద్దరి నుంచి రూ.6.40 లక్షలు నగదు తీసుకుని మోసం చేసిన వారిపై శనివారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేట 4/7వ లైన్ ప్రాంతానికి చెందిన మన్యపుడి కోటయ్య అనే వ్యక్తి బ్రాడీపేటలో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటాడు. 2023లో అదే ప్రాంతంలో మేకతోటి రత్నబాబు, ద్రాక్షవరపు కోటీశ్వరసాయి రాజేష్, సూరే కృష్ణచైతన్య అనే ముగ్గురు పరిచయం అయ్యారు. అయితే కోటయ్య కుమారుడికి, ఆయన సోదరుడు కుమారిడికి వారికి లోటస్ కన్సల్టెన్సీ ఉందని, తమ కన్సల్‌టెన్సీ ద్వారా ప్రభుత్వ శాఖలో అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన కోటయ్య వారికి రూ.6.40 లక్షలు ఇచ్చాడు. నగదు తీసుకున్నప్పటి నుంచి ముగ్గురులో ఎవరూ కూడా సకాలంలో స్పందించడం లేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసుకుంటూ వచ్చారు. ఎంతకు ఎలాంటి సమాధానం, ఉద్యోవకాశాలు కల్పించకపోవడంతో బాధితుడు కోటయ్య అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసి వారిపై కేసు

లక్ష్మీపురం: ఓ యువకుడి కుటుంబంపై కర్రలతో దాడి చేసిన వారిపై శనివారం రాత్రి కేసు నమోదు అయింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ ప్రాంతానికి చెందిన కొండా గోపి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం గోపి స్నేహితులైన నితీన్, కార్తిక్‌ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని కార్తిక్, గోపికి చెప్పడంతో గోపి నితీన్‌కు ఫోన్ చేసి కార్తిక్‌కు క్షమాపణ చెప్పాల్సిందిగా కోరాడు. నితీన్ అతని స్నేహితులైన మణిరెడ్డి మరి కొంత మందితో వచ్చి కొండా గోపి, అతని కుటుంబ సభ్యులపై కర్రలతో దాడి చేశారు. దీంతో గోపిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు నితీన్, మణిరెడ్డిలతో మరి కొంత మందిపై కేసు నమోదు చేశారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో ఊడిపడిన పెచ్చులు



పెచ్చులూడిపడటంతో దెబ్బతిన్న సీలింగ్



గ్రంథాలయంలో పెచ్చులూడి పడిన దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలోని పోటీ పరీక్షల విభాగంలో శనివారం సాయంత్రం పై కప్పు పెచ్చులూడి కింద పడ్డాయి. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ ఉద్యోగార్థులు సీరియస్‌గా చదువుకుంటున్న సమయంలో హఠాత్తుగా పై కప్పు పెచ్చులూడి మీద పడటంతో అభ్యర్థులు భయంతో బయటకు పరుగులుతీశారు. శిథిలావస్థకు చేరిన గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడం అభ్యర్థులకు దిన, దిన గండంలా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా గ్రంథాలయంలోని పైకప్పు బాగా దెబ్బతినడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే ఆందోళనలో అభ్యర్థులు బిక్కుబిక్కుమంటున్నారు.

వేసవి శిక్షణతో విద్యార్థుల్లో ఉల్లాసం, ఉత్సాహం



విద్యార్థులతో కృష్ణప్రసాద్, వెంకట్రావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో ఉల్లాసాన్ని కలిగించి, ఉత్సాహాన్ని నింపేందుకు వేసవి శిక్షణ శిబిరం దోహదం చేస్తుందని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో శనివారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శిబిరంలో భాగంగా క్రీడలతో పాటు వివిధ రకాల ఆటల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. క్రీడా, ఆటల పోటీలతో పాటు మొత్తం 160 మంది విద్యార్థులకు సంగీత, నృత్య అంశాలు, కర్రసాము, తైక్వాండో శిక్షణ హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, శారీరక దారుఢ్యం ఏర్పడటంతో పాటు వారిలో చురుకుదనం, చదువులో ముందుకు వెళ్లేందుకు ఉత్సాహం కలుగుతాయని అన్నారు. పాఠశాల ఏఓ కె.వెంకట్రావు మాట్లాడుతూ పిల్లల బాల్యం ఆనందంగా, ఆహ్లాదకరంగా ముందుకు సాగడంలో వేసవి శిక్షణ శిబిరం దోహదపడిందన్నారు. ఈసందర్భంగా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ బి.శైలజ పాల్గొన్నారు.